## క్లుప్తంగా

### సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలో కొమ్మనవారి ఇలవేల్పు అయిన సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా ప్రారంభించారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద పాలు పొంగించి అమ్మవారికి పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### 22న విగ్రహ ప్రతిష్ఠాపన



నూతన ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో నూతనంగా నిర్మించిన శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, సిద్ధి వినాయక స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.కోటి ఖర్చుతో నిర్మించిన ఈ ఆలయంలో ఆదివారం అర్చకులు బ్రహ్మశ్రీ యలమంచి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రదక్షిణ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

### పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న వీరబాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం సీతానగరం పార్టీ కార్యాలయం నుంచి డాక్టర్ ఘంటా గణేశ్వరరావు ఆసుపత్రి వరకు పాదయాత్ర నిర్వహించిన వీరబాబు విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అధికారం చేపట్టిన తక్షణమే పేదలకు ప్రభుత్వ భూమి అయిదు కుంచాలు చొప్పున అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వీరబాబు తెలిపారు. పార్టీ మహిళా నాయకురాలు పలివెల జ్యోతి, మండల అధ్యక్షుడు సిద్దె రామకృష్ణ, తెలగరావు, నందమూరి చిట్టిస్వామి, మేమగిరి విజయశేఖర్, కెల్లా శ్రీదేవి, పలివెల లోకేష్, సిద్దె నాగరాజు, వేటూరి నానాజీ పాల్గొన్నారు

### ఉచిత దంత వైద్య శిబిరం



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో గల డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పిటల్లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పిటల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం మల్లయ్యపేటకు చెందిన లూసిడ్ డెంటల్ కేర్ వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించి, 60 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ సందీప్, డాక్టర్ బాషా, డాక్టర్ దాల్‌సింగ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు తదితరులు వైద్యసేవలు అందించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

### శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

కడియం: మండలంలోని దుళ్ళలో గల శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఆలయ భక్తబృందం విస్తృత ఏర్పాట్లు చేసింది. వారం రోజులపాటు సాగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా 52 మంది భక్తులు గోవింద మాలలు ధరించారు. వారం రోజుల పాటు స్వామివారి కైంకర్యాల్లో వీరంతా స్వచ్ఛంద సేవలందిస్తారు. 19వ తేదీ ఉదయం పూజా సంకల్పంతో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త అద్దంకి శ్రీనివాస్, అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, భక్త బృందం సభ్యులు తెలిపారు. అయిదు రోజుల పాటు ప్రతి రోజూ రథం, ఒక్కో వాహనంపై వేంకటేశ్వర స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 19వ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం 9.45కి స్వామివారి కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడవాహన సేవ జరుగుతాయన్నారు. 21వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం, సింహవాహన సేవ ఉంటాయన్నారు. 22వ తేదీ ఉదయం 9 గంటలకు అన్నకూటోత్సవం, హనుమంతవాహన సేవ జరుగుతాయన్నారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు లక్ష్మీహోమం, సామూహిక కుంకుమార్చనలు, రాత్రి ఏడు గంటలకు హంసవాహన సేవలు ఉంటాయని వివరించారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీపుష్పయాగం జరుగతాయని తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందన్నారు.

# అంగన్‌వాడీల్లో ఉద్యోగ భాగ్యం

- కార్యకర్తలు, ఆయాలుగా వందలాది మందికి ఉద్యోగాలు
- ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్న ప్రభుత్వం



పందలపాకలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ విప్లవాన్ని తెచ్చింది. సచివాలయం వ్యవస్థను అందుబాటులో తెచ్చి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలను అందించింది. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి లక్షలాది మంది యువతకు ఉపాధి మార్గం చూపింది. వైద్య రంగంలో జీరో వేకెన్సీ పాలసీని తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగాలిస్తుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఖాళీ అయిన వెంటనే పోస్టులను భర్తీ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అన్ని శాఖలతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించే అంగన్‌వాడీల్లోనైతే గత నాలుగున్నరేళ్లుగా అంగన్‌వాడీల్లో వందలాది పోస్టులు భర్తీ చేసింది. ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో 81 మందికి ఉద్యోగాలు కల్పించారు.

**అనపర్తి నియోజకవర్గంలో ఉద్యోగాల కల్పన వివరాలు**

| సంవత్సరం | అంగన్‌వాడీ కార్యకర్త | ఆయా | మొత్తం |
|---|---|---|---|
| 2019 | 7 | 12 | 19 |
| 2020 | 0 | 0 | 0 |
| 2021 | 1 | 5 | 6 |
| 2022 | 8 | 24 | 32 |
| 2023 | 5 | 19 | 24 |
| మొత్తం | 21 | 60 | 81 |

### పారదర్శకంగా నియామకాలు



అంగన్‌వాడీ నియామకాలను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టింది. నాకు అంగన్‌వాడీ ఆయా నుంచి హెల్పర్‌గా పదోన్నతి వచ్చింది. ఎటువంటి సిఫార్సు లేకుండా పదోన్నతి రావడం చాలా సంతోషంగా ఉంది. నాలాగే చాలా మందికి పదోన్నతులు వచ్చాయి.

– వంటాకుల దుర్గాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, కొమరిపాలెం

### హెల్పర్ ఉద్యోగం వచ్చింది



నా భర్త మరణించిన తరువాత నా ముగ్గురు కుమార్తెలతో కుటుంబ జీవనం ఎలాగని ఆందోళన పడుతున్న సమయంలో అంగన్‌వాడీ హెల్పర్‌గా ఉద్యోగం వచ్చింది. నా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటున్నాను.

– చోడిశెట్టి వెంకట పద్మావతి, అంగన్‌వాడీ హెల్పర్, పందలపాక

### ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీ



అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవలకు ఆటంకం ఏర్పడకుండా పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నాం. ఖాళీలు ఏర్పడిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపడుతున్నాం. నాలుగున్నరేళ్ల కాలంలో ఎంతో మందికి పోస్టులు ఇచ్చాం.

– జెస్సీ ఫ్లోరెన్స్, సీడీపీఓ, రంగంపేట ప్రాజెక్టు

### లారీ మిస్సింగ్‌పై కేసు నమోదు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన పరిమి దేవి సిద్దార్ధ తన లారీ కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 25న లారీని గోపాలపురం మండలం ఏళ్లచింతలగూడెంకు చెందిన డ్రైవర్ బొల్లిన శ్రీరామకృష్ణ కూనవరం శ్రీ మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉంచాడని, మరునాడు చూడగా అక్కడ లారీ లేకపోవడంతో శనివారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు

### మద్యం సీసాలు సీజ్ : మహిళ అరెస్ట్

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన వీరమల్ల మంగాలక్ష్మిని అరెస్ట్ చేసి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. 180 ఎంఎల్ క్లాసిక్ బ్లూ విస్కీ సీసాలు 4, సిల్వర్ స్ట్రిప్స్ ఒరిజనల్ రిజర్వ్ విస్కీ సీసాలు 4 శనివారం రాత్రి స్వాధీనం చేసుకుని మంగాలక్ష్మిపై కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

# సంప్రదాయ ప్రచార కేంద్రంగా కోరుకొండ

- చినజీయర్ స్వామి
- రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.3.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి, చిత్రంలో మంత్రి వేణు, ఎమ్మెల్యే రాజా తదితరులు

మధురపూడి: తూర్పు గోదావరి జిల్లాలోని కోరుకొండ గ్రామం ఒకప్పుడు సంప్రదాయ ప్రచార కేంద్రంగా వెలుగొందిందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయరు స్వామి అన్నారు. కోరుకొండలో శ్రీరంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండ పైకి మెట్ల పునరుద్ధరణతో పాటు ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవడం ద్వారానే పూర్వ వైభవం సాధించగలమని అన్నారు. కోరుకొండలో 1928లో విశిష్టాద్వైత ప్రచార సభ జరిగిందని, ఇక్కడ ఏటా వేద పండితులతో ఉపన్యాసాలు జరిగేవని చెప్పారు. ఈ క్రమంలో తాను కూడా పలు సందర్భాల్లో ఉపన్యసించానని, ఆవిధంగా కోరుకొండతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని అన్నారు. 1982లో నారసింహస్వామి వారి కల్యాణానికి ముందు నేపాల్‌లోని ముక్తినాథస్వామిని దర్శించుకోవాలనుకున్నానని, అప్పట్లో కాలి నడకనే వెళ్లాల్సి ఉన్నందున తన గురువులు 12 నిమిషాల్లో కోరుకొండ నారసింహస్వామి కొండ మెట్లన్నీ ఎక్కాల్సిందిగా ఆదేశించారని చెప్పారు. అదేవిధంగా 12 నిమిషాల్లోనే ఈ కొండ పైకి ఎక్కడంతో నేపాల్ పర్యటనకు ఎంపికయ్యానని స్వామీజీ చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా అతి ప్రాచీన చరిత్రకు ప్రాణం పోసినట్టయ్యిందని అన్నారు. భారత్ – శ్రీలంక మధ్య ఉన్న రామసేతు వయస్సు 17.50 లక్షల సంవత్సరాలని, మానవ నిర్మితమని అమెరికాలోని నాసా సంస్థ ప్రకటించిందని చినజీయరు వెల్లడించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, జక్కంపూడి కుటుంబంతో తనకు ఎనలేని అనుబంధం ఉందని అన్నారు. ఆలయాల పునర్నిర్మాణం ద్వారా ఈ ప్రాంతానికి గత వైభవం తీసుకురావాలన్న స్థానిక రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆకాంక్షను అభినందించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ధర్మకర్త ఎస్‌పీ రంగరాజ భట్టర్, రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త ఎస్‌పీ నరసింహ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



ఉమారామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే రాజా తదితరులు

సీతానగరం: రాజానగరం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభను మరింత సంతరించుకునే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం మండలంలోని కాటవరంలో శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆయల పునఃనిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ సౌజన్యంతో అనేక ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. అందులో భాగంగా ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున 117 ఆలయాల నిర్మిస్తున్నామన్నారు. సీతానగరం మండలం కాటవరంలో సుమారు రూ.70 లక్షలతో సీజీఎఫ్ గ్రాంట్‌తో ఆలయా నిర్మాణం జరిగిందన్నారు. సీతానగరంలో రామాలయం నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచే విధంగా కట్టుబడి పని చేస్తున్నామన్నారు. స్వామివారి కృపాకటాక్షాలతో ఈ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఉపసర్పంచ్ కోన రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాజానగరం నియోజకవర్గం ఆధ్యాత్మికతకు నిలయం

**ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



కోరుకొండలో నిర్వహించిన స్వామివారి కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు

మధురపూడి: రాజానగరం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మికతకు నిలయంగా మార్చినట్టు, గ్రామాల్లో 117 దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా వెల్లడించారు. ఆదివారంకాపవరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ, శ్రీవాణి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 117 దేవాలయాల నిర్మాణాం జరుగుతోందన్నారు.కోరుకొండలో శ్రీ రంగనాథస్వామి ఆలయం పునర్నిర్మాణం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మెట్ల పునరుద్ధరణ, ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మాణం, స్వామివారి కోనేరు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంలో స్వామివారి కృప వల్లే సాధ్యమైందన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రతికూలంశాలెన్నింటినో ఎదుర్కొంటూ ప్రజా సేవలో ముందున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి నిర్వహించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఆర్‌బీకే, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు నిర్మించినట్టు తెలిపారు. బల్క్ మిల్క్ కేంద్రాల నిర్మాణం జరుగుతోందన్నారు. కోరుకొండను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడం కోసమే ఇక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్య కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కాపవరం సర్పంచ్ ఉంగరాల రాము, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కాలచర్ల శివాజీ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు రమాదేవి, బొరుసు బద్రి, నీరుకొండ బాబ్జి, కొయిడాల నానాజీ పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే పారదర్శక పాలన



చేనేత కార్మికులకు మంజూరైన నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వ సేవలు పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా ప్రజల ముంగిటకు చేర్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పులుగుర్త, అనపర్తి శివారు కొత్తూరు గ్రామాల్లో సుమారు రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు, వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. పులుగుర్తలో రూ.10.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని, కొత్తూరులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం–3, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయం, కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే ప్రారంభించారు. పులుగుర్త క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామానికి చెందిన 233 మంది చేనేత లబ్ధిదారులకు చేనేత పరికరాలు, సోలార్ పరికరాలతో పాటు వీటి నిమిత్తం మంజూరైన రూ.1.20 కోట్లు విలువచేసే చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ సంక్షేమం, వీధి వీధి అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరంగా అందించేందుకు సీఎం జగనన్న సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి పాలనను పల్లె ముంగిటకి తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా ఆర్‌బీకే సెంటర్లు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, అనపర్తి, పులుగుర్త సర్పంచ్‌లు వారా కుమారి, కాకరపర్తి వేణు, ఎంపీటీసీ గుత్తుల మహాలక్ష్మి, ఉపసర్పంచ్‌లు చిర్ల వీర్రాఘవరెడ్డి, కర్రి భామిరెడ్డి, పడాల సూరారెడ్డి, కర్రి ధర్మారెడ్డి, మల్లిడి వెంకటరెడ్డి, పడాల కృష్ణారెడ్డి, అనపర్తి గోపాల కృష్ణమూర్తి, సత్తి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మాచరమ్మవారి జాతర



ఆలయంలో అమ్మవారి గద్దెలు

అనపర్తి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న మండలంలోని పాలమూరు శివారు చినపాలమూరు గ్రామ దేవత మాచరమ్మ అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని, ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఏటా మాఘ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఆదివారం రాత్రి అమ్మవారి జాతర, సోమవారం తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి ఆలయంలో గల గద్దె పీఠాన్ని కిందకు దించడంతో జాతర ప్రారంభమైంది.అమ్మవారి గద్దె పీఠాన్ని శిరసున ధరించిన భక్తులు పాలమూరు పాకలతో పాటు పాలమూరు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం అమ్మవారి తీర్థం జరగనుంది.

# జగనన్న పాలనలోనే గ్రామాల అభివృద్ధి



కొమరిపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు



సుభద్రంపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

బిక్కవోలు: జగనన్న పాలనలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో గ్రామాల స్వరూపమే మారిపోయిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొమరిపాలెంలో రూ.27.70 లక్షల రుడా నిధులతో చేపట్టిన సుందరీకరణ పనులకు రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే పరిపాలన అందించడంతో ప్రజలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. రుడా నిధులతో కొమరిపాలెంలో చేపడుతున్న సుందరీకరణ పనులతో గ్రామం పచ్చతోరణంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధి, సుందరీకరణకు కృషి

అనపర్తి: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) పరిధిలోని గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రుడా నిధులు రూ.38 లక్షల వ్యయంతో చేపట్టనున్న సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి రౌతు సూర్యప్రకాశరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుడా పరిధిలోని వివిధ గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటడం, సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ప్రతిపాదిత పనులకు నిధులు మంజూరు చేసి పనులు సకాలంలో పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, వ్యాపారవేత్త తేతలి నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలో రూ.35 లక్షలతో చేపట్టబోయే కోనేరు సుందరీకరణ పనులను ఆదివారం ఉదయం రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుడా నిధులతో కోనేరు చుట్టూ ప్రహరీ, ర్యాంపు నిర్మించి, గట్టును సుందరీకరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వడిశలేరులో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు.

# కాంట్రాక్టర్లు తప్పుదోవ పట్టిస్తున్నారు



పురుషోత్తపట్నం వద్ద శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది

సీతానగరం: శ్రీ సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేసే సిబ్బంది విషయంలో అధికారులను.. కాంట్రాక్టర్లు తప్పుదోవ పట్టిస్తున్నారని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ మెయింటినెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాతి శేషారావు, సెక్రటరీ కట్టుమూరి వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పురుషోత్తపట్నం శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పురుషోత్తపట్నం, కుట్రవాడలోని శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో వాస్తవానికి పనిచేస్తున్న కార్మికుల సంఖ్య 100 మంది కాగా, పాత కాంట్రాక్టర్లు 350 మంది పనిచేస్తున్నట్లు రికార్డులలో చూపుతున్నారని అన్నారు. జిల్లా విభజన తరువాత తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ వద్ద వాస్తవానికి పనిచేస్తున్న కార్మికుల సంఖ్య 50 మంది ఉండగా, అధికారులకు 62 మంది పని చేస్తున్నారని చెప్పారని, కాని గవర్నమెంట్ అగ్రిమెంట్‌లో పని చేస్తున్న కార్మికుల సంఖ్య 74 మందిగా కాంట్రాక్టర్లు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా అధికారులను కాంట్రాక్టర్లు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పైప్‌లైన్లు మరమత్తులు చేయకుండా బిల్లులు చేయించుకుంటున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.